మంత్రి నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

మాట్లాడుతున్న పుట్ట మధూకర్

- ఇసుక లారీలకు 15 నెలల్లో 35 మంది బలి
- మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు బాధ్యత వహించాలి
- మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

రామగిరి మార్చి 12 : మంత్రి శ్రీధర్ బాబు నిర్లక్ష్యంతోనే ఇసుక లారీలకు ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు మంత్రి బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. కల్వచర్లలో ఇసుక లారీ ప్రమాదంలో మృతి చెందిన దొంతుల శ్రీవాణి కుటుంబ సభ్యులను పుట్ట మధూకర్ బుధవారం పరామర్శిం చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాను గెలిస్తే రెండు రోజుల్లోనే ఇసుక రవాణాను బంద్ చేయిస్తా అని ప్రగల్భాలు పలికిన మంత్రి, పదిహేను నెలలైనా ఎందుకు పట్టించుకోవడం లేదో మంథని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రెండు రోజుల్లోనే ఇసుక బంద్ చేయిస్తా అని 24 గంటల రవాణాకు తెరలేపారని ఆరోపించారు. 15 నెలలుగా ఇసుక రవాణా ఆపడంలో మంత్రి నిర్లక్ష్యం మూలంగానే సుమారు 35 మంది బలయ్యారని అందుకు కారణమైన ప్రభుత్వ బాధ్యునిగా దుద్దిళ్ల శ్రీధర్‌పై 106 బీఎన్ ఎస్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలో ఉండగా ప్రమాదాలు జరిగితే గగ్గోలు పెట్టిన మంత్రికి రక్తపు మరకలు అంటవద్దని ఇప్పుడు పోలీసులు ఏకంగా ప్రమాద స్థలాన్ని నీళ్లు పోసి కడిగేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ , బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శెంకేషి రవిందర్ , బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు కాపురవేన భాస్కర్ , శేఖర్ , నాయకులు ఆసం తిరుపతి, మల్యాల మోహన్ , సైండ్ల సత్యం, రేండ్ల అశోక్ , స్వామి, రాము, పోశం తదితరులు పాల్గొన్నారు.

97.8 శాతం హాజరు

పెద్దపల్లి, మార్చి12: జిల్లాలో ఇంటర్ సెకండియర్ పరీక్షకు 97.8 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఐఈవో కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండ్ ఇయర్ మ్యాథ్స్ 2/ బాటనీ / పోలిటికల్ సైన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఈ పరీక్షకు 5107 మందికిగాను 4995 మంది హాజరయ్యారు.

డ్యాన్స్ చేస్తున్న మహిళలు

ఘనంగా మహిళా దినోత్సవం

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 12: సింగరేణి ఆర్జీ–2 ఏరియాలో బుధవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు సేవా అధ్యక్షురాలు వనజా వెంకటయ్య, ఆర్జీ–2 జీఎం వెంకటయ్యలు హాజరై ప్రారంభించారు. మహిళా దినోత్సవం విశిష్టతను, మహిళా ప్రాముఖ్యతను వివరించారు. మహిళా సాధికారత కోసం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఎంతో మంది సొంత యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెక్రెటరీ రవీందర్, డీజీఎం బైద్య, అనిల్‌కుమార్, కవిత, కల్పన, సునీత, ఏజీఎం ఎర్రన్న, డీజీఎం మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, మహ్మద్ షరీఫ్, శ్యామ్ ప్రసాద్, నరేందర్ రెడ్డి, దేవారెడ్డితోపాటు ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఎల్ఆర్ఎస్ వసూలు చేయాలి

- అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- దవాఖానాలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

మాట్లాడుతున్న కలెక్టర్

సుల్తానాబాద్, మార్చి 12 : పట్టణంలో మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్ ఫీజు వసూలు చేసేలా పట్టిష్టమైన కార్యచరణతో ముందుకు సాగాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష మున్సిపల్ అధికారులకు సూచించారు. బుధవారం సుల్తానాబాద్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ దవాఖాన, జడ్పీ హైస్కూల్, ఎంపీడీవో ప్రాంగణంలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను లెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణంలో నిబంధనల ప్రకారం 1036 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం అమోదించడం జరిగిందనీ, వీరిని ఫాలో అప్ చేస్తూ మార్చి 31లోగా ఫీజు చెల్లించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. మార్చి 31లోపు పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించినట్లయితే 25 శాతం రిబేటు లభిస్తుందన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, అలా గే ప్రభుత్వ ప్రదాన దావాఖానాను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్, ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, హెచ్ఎం శారద ఆర్ఎంవో మహేందర్ వైద్యాధికారులు తదితరులున్నారు.

ఖనిలో ‘స్వచ్ఛంద’ పెళ్లి సందడి

మధూవరులతో స్వచ్ఛంద సంఘాల బాధ్యులు

- అప్పగింతల దాకా అన్నీ తామై...
- ఆదర్శంగా నిలిచిన స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక

కోల్‌సిటీ, మార్చి 12: గోదావరిఖనిలో ‘స్వచ్ఛంద’ పెళ్లి సందడి మార్మోగింది. రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఓ నిరుపేద అమ్మాయి పెళ్లిని అన్ని లాంఛనాలతో సవ్యంగా జరిపించారు. రామగుండం ఎన్టీపీసీకి చెందిన తాళ్లపల్లి జోగయ్య–జయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కరుణకు వివాహం నిశ్చయం కాగా, నిరుపేద కుటుంబం కావడంతో కూతురి పెళ్లిపై బెంగపెట్టుకున్న ఆ కన్నవారికి రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్య వేదిక సభ్యులు అండగా నిలిచారు. పెళ్లి బాధ్యతలు తీసుకొని తమవంతుగా సాయం చేయడంతో పాటు గత నెల రోజులుగా దాతల నుంచి విరాళాలు సేకరించారు. బుధవారం గోదావరిఖని శివారులోని శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వివాహ మహోత్సవం కనుల పండువగా జరిపించారు. వధూ వరులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. బంధువులు కూడా పెళ్లికి సాయం చేయలేని ఈ రోజుల్లో తమకెలాంటి రక్త సంబంధం లేకపోయినా అంతకంటే ఎక్కువగా ముందుండి తమ కుమార్తె పెళ్లి జరిపించారంటూ ఆ అమ్మాయి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కోల్‌బెల్టు వాతావరణంకు పూర్తి భిన్నంగా స్వచ్ఛంద సంఘాల సభ్యులు ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు గోలివాడ చంద్రకళ, వెల్ది కవిత అనంత రాములు, మద్దెల దినేష్, ఐత శివకుమార్, క్రాంతి కుమార్, గౌస్, రమేష్, గాదం సరిత, మేడగోని స్వప్న, కొండు రమాదేవి, బోగె లత, పీ.చంద్రకళ, సుశీల, అనురాధ, కవిత, శారద, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో సింగరేణి ఆస్తిత్వం కోల్పోతుంది

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మార్చి 12: సింగరేణి ప్రవేటీకరణ నిర్ణయంతో సంస్థ ఆస్తిత్వాన్ని కోల్పోతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని యూనియన్లు కలిసి ఎదురించి కోయగూడెం, సత్తుపల్లి గనులను దక్కించుకున్నప్పటికీ నేడు భయంతో బొగ్గు తీయడం లేదన్నారు. ఇప్పుడు బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడం వారికి అనుమతి ఇచ్చినట్లుగానే పరిగణించాల్సి ఉంటుం దన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు అనుమతి ఇవ్వండని ఆహ్వానించడం కార్మిక వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. కార్మికులు, సంస్థను ఇబ్బందుల్లోకి నెట్టివేసే చర్యగా టీబీజీకేఎస్ భావిస్తున్నదన్నారు. బొగ్గు గనుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనడాన్ని టీబీజీకేఎస్ వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వేలంతో ప్రైవేట్ సంఖ్య పెరుగుతూ గనుల సంఖ్య తగ్గుముఖంతో ప్రైవేటీకరణలో గుత్తాధిపత్యం ఉంటుందన్నారు. అన్ని సంఘాలు వ్యతిరేఖిస్తుంటే గెలిచిన ఈ రెండు కార్మిక సంఘాలు అనుసరిస్తున్న రెండు నాలుకల దోరణిని అవలంభిస్తున్నారని, కార్మిక వర్గంను చైతన్యపరుచనున్నట్లు తెలిపారు. ఇక్కడ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు నూనె కొముయ్య, ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్, పింగిలి సంపత్‌రెడ్డి, నాగెలి సాంబయ్య, చెల్పూరి సతీశ చల్లా రవీందర్‌రెడ్డి, చెలకలపల్లి శ్రీనివాస్, కొండ్ర అంజయ్య, వాసర్ల జోసెఫ్, జనగాం మల్లేశ్, బొగ్గుల సాయిలు, అప్సర్ పాష, పులిపాక శంకర్, ఉప్పులేటి తిరుపతి, మీసరాజు, భాస్కర్ ఉన్నారు.

మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

విధుల్లో ఆలసత్వం పనికిరాదు

- రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 12: విధుల్లో పోలీసులకు అలసత్వం పనికిరాదని, ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందితో సీపీ సమావేశమయ్యారు. నేరాల నియంత్రణలో మొదటగా ప్రజలకు అందుబాటులో ఉండే బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. కమిషనరేట్ పరిధిలో చాలా వరకు పారిశ్రామిక ప్రాం తంతో ఇక్కడ జరిగే ప్రతి విషయం గుర్తించి ప్రతి ఒక్కరికి అవగాహన సమాచారం ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఒక టీమ్‌గా పనిచేసినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. నీట్ టర్న్ అవుట్, ఫిట్నెస్‌తో క్రమశిక్షణతో ఎదుటి వారికి ఆదర్శంగా ఉండాలన్నారు. విధుల్లో ఆలసత్వం ప్రదర్శించినట్లుయితే శాంతిభద్రతల సమ స్య తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసినప్పుడే మంచి పేరు రానున్నట్లు తెలిపారు. 100 డయల్ కాల్‌కు అత్యవసర సమయంలో బాధితులకి వేగవంతమైన స్పందన తప్పక ఇవ్వాలని తక్కువ సమయంలోనే సంఘటన స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కారించాలని, సేవలు అందించాలన్నారు. ఇక్కడ స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్స్ వర్టికల్స్ ఇన్‌చార్జీలు, సిబ్బంది ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

పరీక్ష ప్యాడ్లు అందుకున్న విద్యార్థులతో రఘువీర్ సింగ్

జూలపల్లి, మార్చి 12 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని, వాటి సాధనకు శ్రమించాని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలు, జూపిటర్, న్యూ బ్రిలియంట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ‘నేనున్నా’ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలస్థాయిలో నిలిచిన ముగ్గురు టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తానని ప్రకటించారు. కాగా పెద్దాపూర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులకు ‘ఫ్రెండ్స్’ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సరస్వతి, ప్రిన్సిపాల్ షాదుల్, హెచ్ఎంలు లక్ష్మణ్, అందె కుమారస్వామి, కొండ సత్యం, నాయకులు పొలగాని సతీశ్, కన్నం రమేశ్, లక్కాకుల శ్రీనివాస్, కొప్పుల శ్రీధర్, మెండె తిరుపతి, మేర శ్రీనివాస్, అంకూస్, ఉయ్యాల క్రాంతికుమార్, ఉయ్యాల నవీన్, ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సరఫరా అందించాలి

ముత్తారం, మార్చి 12: గ్రామాల్లో తాగునీరు సమస్య రాకుం డా నిరంతరం సరఫరా చేయాలని డీపీవో వీరబుచ్చయ్య అధికారులకు సూచించారు. మండలంలోని మైదంబండ, పారుపల్లి గ్రామాలను బుధవారం ఆయన పరిశీలించారు. సందర్భంగా ఆయన ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించారు. నీటి ఎద్దడి ఎక్కడ ఉంటదో అక్కడ వెంటనే సమస్యను పరిష్కరించి ఏమైనా చిన్న చిన్న మరమత్తులు ఉంటే వెంటనే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం పారుపల్లి ఆమ్లెట్ గ్రామమైన శాత్రాజ్ పల్లికి ట్రాక్టర్ పై వెళ్లి గ్రామానికి మంచినీటి సౌకర్యానికి సంభందించి పైప్ లైన్ కు అయ్యే ఖర్చుకు సంబంధించిన నిధులను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నట్లు తెలిపారు.ఎంపీఓ గోవర్ధన్, కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 డిస్పెన్సరీలో నూతన పరికరాలు ప్రారంభం

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 12: సింగరేణి ఆర్జీ–2 డిస్పెన్సరీలో నూతనంగా కొనుగోలు చేసిన పరికరాలను ఆర్జీ–2 జీఎం వెంకటయ్య బుధవారం ప్రారంభించారు. ఈ పరికరాల ద్వారా ఉద్యోగులకు పక్షవాతం, ఆపరేషన్ వల్ల బిగుసుకుపోయిన కండరాలను మసాజ్ ద్వారా మామూలు స్థితిలోకి తీసుకురావచ్చని తెలిపారు. ఈ పరికరాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా మెడికల్ క్యాంపులలో కూడా ఉపయోగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో కిరణ్ రాజ్, ఏఐటీయూసీ సెక్రెటరీ రవీందర్, గని ఏజెంట్ నెహ్రూ, డీజీఎం పర్సనల్ అధికార ప్రతినిధి అనిల్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్, సురేశ్, వైద్యులు చంద్రశేఖర్, ఆదినారాయణ, సాహితి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వొద్దు

కాల్వశ్రీరాంపూర్, మార్చి12: వేసవిలో తాగునీటి సమస్య రాకుం డా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీపీవో వీరబుచ్చయ్య తెలిపారు. మండలంలోని ఇద్లాపూర్, జాఫర్‌ఖాన్‌పేట గ్రామాన్ని బుదవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంభందిత అధికారులతో కలిసి మంచినీటి బావులను పరిశీలించారు. పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జీపీ లో రికార్డులు పరిశీలించి వంద శాతం ఇంటి బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఇక్కడ ఎంపీవో కిరణ్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ కళ్యాణ్, పంచాయతీ కార్యదర్శులు శంకర్, రాజు, జీపీ సిబ్బంది ఉన్నారు.

చేతిరాత పై విద్యార్థులకు శిక్షణ

ఓదెల, మార్చి 12: పొత్కపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు చేతివ్రాత పై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా(పీఎం శ్రీ) ఎక్స్‌పర్ట్ టాక్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. ప్రముఖ కాలిగ్రాఫర్ (చేతివ్రాత నిపుణుడు) రాంపెల్లి విజయ్ భాస్కర్ విద్యార్థులకు చేతివ్రాతలో పలు మెళకువలు నేర్పారు. తెలుగు, ఆంగ్ల భాషలో అందమైన వ్రాత ఎలా ఉండాలో తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల ఉన్న భయాన్ని తొలగించడానికి ప్రేరణ కల్పించారు. అందమైన చేతివ్రాత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం

మంథని/మంథని రూరల్, మార్చి12: పట్టణంలోని జడ్పీ హెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్, గుంజపడుగు గ్రామంలో గల జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్‌లో బుధవారం ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మేరకు పట్టణంలోని గర్ల్స్ స్కూల్‌లో అడవిసోమన్‌పల్లి, గద్దలపల్లి స్కూల్ విద్యార్థులు సందర్శించారు. గుంజపడుగు స్కూల్‌లో చిల్లపల్లి, యూపీఎస్ ఉప్పట్ల, యూపీఎస్ అక్కెపల్లి పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు హెచ్ఎంలు ఘనంగా స్వాగతం పలికారు. పాఠశాలల్లో ఉన్న మౌళిక సదుపాయాలను విద్యార్థులకు చూపించారు. ల్యాబ్‌లు, లైబ్రేరీ, టాయిలెట్స్, కంప్యూటర్ ల్యాబ్ ఇతర సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడి గిన పలు సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో దాసరి లక్ష్మీ, హెచ్ఎంలు శైలజ, ఉపాధ్యాయులు శివలీల, కర్రు సురేష్, నరేష్, సదానందం, శిరీష, సంగీత, స్వామి, రవి, కుమార్, విజయలక్ష్మీ, భూమయ్య, సతీష్ రెడ్డి, నరేందర్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

కోర్టు భవనాల పరిశీలన

కోర్టు భవనాలను పరిశీలిస్తున్న జడ్జి న్యాయమూర్తి

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 12: గోదావరిఖనిలోని శారదనగర్‌లో నిర్మిస్తున్న నూతన కోర్టు భవనాలను బుధవారం అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు పరిశీలించారు. కోర్టు పార్కింగ్ స్థలం, న్యాయమూర్తుల నివాస భవనాలను పరిశీలించారు. త్వరితగతిన భవనాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. బుద్జెట్ విషయం త్వరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ భవనాల నోడల్ ఆఫీసర్ సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ ఏటలు రఫీకుద్దీన్, శ్రీనివాసరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీశ్, ఉపాధ్యక్షుడు రామటెంకి శ్రీనివాస్, నాయకులు పులిపాకర ప్రవీణ్, ఇరుగురాల మహేందర్, సంతోష్, న్యాయవాదులు ఉన్నారు.

21న జేఎన్టీయూలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్

రామగిరి మార్చి 12 : నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్ర పెద్దపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 21న మథని జేఎన్టీయూ కళాశాల లో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి రాంబాబు బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా స్థాయి యువ ఉత్సవంలో 15 నుంచి 29 ఏళ్ల లోపు యువతీ యువకులు పాల్గొనవచ్చునని పేరొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 12: డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 79.50 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని బుధవారం గోదావరిఖని 5 ఇంక్లైన్ వద్ద టాస్క్‌ఫోర్స్ రమేష్ బాబు తన సిబ్బందితో పట్టుకున్నారు. మంథని నుంచి గోదావరిఖని మీదుగా మహారాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న మంథనిలోని శ్రీపాదకాలనీకి చెందిన దేశెట్టి మారుతి అనే వ్యక్తిని ఆదుపులోకి తీసుకున్న పోలీసులు దాదాపు రూ. 3లక్షల 8వేల 100 ఖరీదు చేసే పీడీఎస్ బియ్యంను స్వాధీన పరుచుకున్నారు. మరో ఇద్దరు నిందితులు మంథనికి చెందిన రాచర్ల రమేశ్, ఓదెల మహేందర్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. స్వాధీన పరుచుకున్న బియ్యం, నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ పేర్కొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి టౌన్, మార్చి12: యువత వ్యసనాలు, గొడవలకు దూరంగా ఉండాలని, రౌడీ షీట్స్ ఓపెన్ అయిన వ్యక్తులు సతవర్తనతో మెలగాలని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ఠాణలో రౌడీ షిటర్స్‌కు ప్రజలతో ఏలా మెలగాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. యువత చట్టాలపైన అవగాహన పెంచుకొని ఇతరులతో మర్యాదగా నడుచుకోవాలని, మీకు ఏదైన సమస్య వస్తే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సమాచారం లేదా ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజలకు పోలీసులు అన్ని రకాలుగా సహకరాలు అందించాలని కోరారు. ఇక్కడ కానిస్టేబుల్స్ సతీశ్, వెంకటేశ్ ఉన్నారు.

బియ్యం పట్టివేత..

మంథని రూరల్, మార్చి12: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సిద్దపల్లి గ్రామంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్ల ఉంచిన 106 ప్లాస్టిక్ బ్యాగుల్లో 54.40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యం అయినట్లు తెలిపారు. నింధితులు రియాజ్ పై చేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పోలీస్ సిబ్బంది, సివిల్ సప్లై సిబ్బంది ఉన్నారు

రోడ్డు మళ్లింపు పనులు అడ్డుకున్న గ్రామస్తులు

రామగిరి మార్చి 12 : మంథని– పెద్దపల్లి ప్రధాన రహదారి లద్నాపూర్ వద్ద దారి మళ్ళింపు పనులు చేపటడానికి రామాలయం వద్ద ఎల్–6 కెనాల్ లో పైపులు వేసే పనులను బుధవారం అక్కడి భూనిర్వాసితులు అడ్డుకున్నారు. సింగరేణి సంస్థ తమకు పన్నూర్ పరిధిలో ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్లాట్స్‌లో ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని తమకు అన్ని సౌకర్యాలు కల్పించిన తర్వాతే తమ భూములోంచి దారి మళ్ళింపు చేపట్టాలని వారు ఆందోళన చేపట్టారు.

రాఘవాపూర్‌ను సందర్శించిన ఎస్‌సిఈఆర్టీ

పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌సిఈఆర్‌టి బృందం

పెద్దపల్లి రూరల్, మార్చి 12: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ పాఠశాలను ఎస్‌సిఈఆర్‌టి బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధన, ఎఫ్ఎల్ఎన్‌సిసిఈ రికార్డ్స్, వివిధ రకాల రిజిష్టర్‌లు,లైబ్రరీ, మధ్యాహ్నభోజనం తదితర అంశాలకు సంబంధించిన విషయాలను హెచ్ఎం, ఉపాధ్యయులను విద్యార్థులను అడిగి తెలుసుకుని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన తీరును పరిశీలించి బోధన పద్దతులపై ఉపాధ్యాయులను అభినందించారు. విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థులపట్ల తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఈఆర్‌టి శిక్షణ సంస్థ సభ్యులు గణపతి శర్మ, జి.జగన్‌మోహన్, హెచ్ఎం సతీష్‌బాబు, ఉపాధ్యాయులు డి. లక్ష్మి, శోభ, సీఆర్పీ శ్రీలత పాల్గొన్నారు.

గ్రూప్ 2లో మెరిసిన సీతంపల్లి వాసి

ముత్తారం మార్చి 12; మండలంలోని సీతంపల్లి గ్రామానికి చెందిన గంట మహేష్ గౌడ్ గ్రూప్ 2 ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా 143 ర్యాంక్ సాధించాడు. కాగా మహేశ్ గౌడ్ గతంలో గ్రూప్ 4 ఫలితాలలో విజయం సాధించి ప్రస్తుతం పెద్దపల్లి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నాడు. పట్టుదలతో సివిల్స్ ప్రిపేర్ అయిన మహేష్ గౌడ్ మొదటి దఫాలో సివిల్స్ రాకపోవడంతో గ్రూపులో 2లో విజయం సాధించారు. మంథని జేఎన్టీయూ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన మహేశ్ గౌడ్ ఇంటర్మీడియట్ విద్యను మంథనిలోని చైతన్య జూనియర్ కళాశాలలలో ఇంటరీడియట్ చదివి డివిజన్ టాపర్ గా నిలిచాడు. ఎప్పటికైనా సివిల్స్ సంపాదించాలని లక్ష్యంతో ప్రిపేర్ అవుతున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. మహేష్ గౌడ్ కు తండ్రి రాజన్న గౌడ్ మూడు సంవత్సరాల క్రితం చనిపోగ తల్లి శంకుంతల గ్రామంలో నివాసం ఉంటున్నారు. మహేవశ్ గౌడ్ కు ఇద్దరు చెల్లెల్లు ఉండగా ఒక్కరికి వివాహం కాగా చిన్న చెల్లెలు మానస హైదరాబాద్ లో ఎఆర్ కానీస్టేబుల్ గా విధులు నిర్వహిస్తుంది. మహేష్ గౌడ్ కు డిప్యూటీ తాహాశీల్దార్ కానీ, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ కానీ, ఏసిటీవో ఉద్యోగం లభించే అవకాశం ఉంది. కాగా మహేష్ గౌడ్ ను గ్రామస్తులు అభినందించారు.

కాటమయ్యకు పూజలు

ముత్తారం, మార్చి 12: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కాటమయ్యకు మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. గ్రామంలో గల కాటమయ్య విగ్రహానికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్లు 1) సంది నారాయణ రెడ్డి, తండ్రి : రాంచంద్రారెడ్డి, వయస్సు, 64 సం||రాలు, వృత్తి : మాజీ సింగరేణి ఉద్యోగి, 2) సంది రమాదేవి, భర్త: లేట్ సంది రాజిరెడ్డి, వయస్సు 50 సం||రాలు, వృత్తి గృహిణి, 3) సంది శ్రీనివాస రెడ్డి, తండ్రి: లేట్ సంది రాజిరెడ్డి, వయస్సు: 45 సం||రాలు, వృత్తి: ప్రయివేటు ఉద్యోగి, అందరి నివాసం: ఇ.నె. 21-2-42 మార్కండేయ కాలని, గోదావరిఖని, రామగుండం మండలము, పెద్దపల్లి జిల్లా, తెలంగాణ రాష్ట్రం అయిన, నా క్లయింట్లలో మొదటి వారి తల్లి గారు, రెండవ వారి కోడలు (కుమారుని భార్య) మరియు మూడవ వారి నానమ్మ అయిన కీ||శే|| సంది రత్నమ్మ, భర్త : సంది రాంచంద్రారెడ్డి గారి పేరు మీద ఉన్నటువంటి స్థానిక మార్కండేయకాలనీ, గోదావరిఖనిలోని సర్వే నెం. 676/సి లో గల ఇ.నెం. 21-2-42, విస్తీర్ణం 363 చ||గజాల ప్లాటును దస్తావేజు నెం. 1376/1979 తేది. 19-07-1979 రోజున శ్రీమతి ఉత్తర నాగమణి, భర్త : మాణిక్‌రావు గారి ద్వారా మా తల్లి గారు కొనుగోలు చేసియున్నారు. సదరు దస్తావేజు డాక్యుమెంటును తేది : 15-02-2025 రోజున ఉదయం 11.30 గంటలకు నా క్లయింట్ మార్కండేయ కాలని నుండి గోదావరిఖని బస్టాండు వరకు ఆటోలో వెళుతుండగా మార్గమధ్యంలో పోగొట్టుకున్నారు. సదరు విషయమై గోదావరిఖని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేసియున్నారు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినట్లయితే వారు ఈ క్రింది తెలిపిన అడ్రసులో అందజేయగలరు. మరియు ఎవరికైనా సదరు దస్తావేజుపై అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్నయెడల ఈ రోజునుండి 5 రోజుల లోపు ఈ క్రింది. అడ్రసు వారిని సరియైన ఆధారాలతో సంప్రదించగలరు. లేనియెడల సదరు దస్తావేజు పై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు లేవని భావించవలసియుంటుందని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

ఇట్లు: సం/- జవ్వాజి శ్రీనివాస్, న్యాయవాది మరియు నోటరి
గోదావరిఖని. సెల్: 98494 10161.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

DOCUMENT LOST
I Gorla Komuraiah S/o. G.Agaiah, R/o.Kannapur Vill, Keshavapatnam Mdl Karimnagar. Dt:25/2/25 iam Traveling from Kannapur to Huzurabad on motercycle I Lost my original Regd. Doct No. 371 of 1997. Dated. 12/2/1997 And 2899 of 1988. if found any one plz cont:9704711253

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189